
సాక్షి నంద్యాల

బుధవారం ; 13 ; నవంబర్ ; 2024



అలరించిన నృత్య ప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: స్థానిక నిత్యకళా వేదికపై మంగళవారం మహబూబ్‌నగర్‌కు చెందిన సాయికృపా కూచిపూడి కళాక్షేత్రం, హైదరాబాద్‌కు చెందిన నృజన వారి నృత్య ప్రదర్శనలు అలరించాయి.



శనగల బసవన్నకు పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ ప్రాంగణంలోని శనగల బసవన్నకు, బయలు వీరభద్ర స్వామి వారికి మంగళవారం శాస్త్రోక్తంగా ఆలయ అర్చకులు పూజలు నిర్వహించారు.



తగ్గిన నీటి విడుదల

కర్నూలు సిటీ: సుంకేసుల బ్యారేజీకి ఇన్‌ఫ్లో తగ్గుతుండటంతో దిగువకు నీటి విడుదలను తగ్గించారు. ఇన్‌ఫ్లో 2,015 క్యూసెక్కులు ఉండగా కేసీ కెనాల్‌కు 1,930 విడుదల చేశారు.

న్యూస్‌రీల్

తగ్గుతున్న శ్రీశైలండ్యాం నీటి మట్టం

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలండ్యాం నీటి మట్టం రోజు రోజుకు తగ్గుతోంది. ఎగువ జూరాల, సుంకేసుల నుంచి నీటి విడుదల పూర్తిగా నిలిచిపోవడం, శ్రీశైలం నుంచి దిగువ ప్రాజెక్ట్‌లకు నీటి విడుదల కొనసాగుతుండడంతో నీటి మట్టం తగ్గుతోంది. సోమవారం నుంచి మంగళవారం వరకు ఎగువ ప్రాజెక్ట్‌ల నుంచి 4,350 క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది. జలాశయం నుంచి దిగువ ప్రాజెక్ట్‌లకు 27,496 క్యూసెక్కుల నీరు విడుదలయ్యింది. కుడిగట్టు కేంద్రంలో 0.146, ఎడమగట్టు కేంద్రంలో 6.449 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. జలాశయంలో 169.8650 టీఎంసీల నీరు ఉంది. డ్యాం నీటి మట్టం 876.30 అడుగులకు చేరుకుంది.

అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు




వివరాలు తెలుసుకుంటున్న పీడీ జనార్దన్‌రావు

మహానంది: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం.జనార్దన్‌రావు హెచ్చరించారు. బుక్కాపురంలోని వెలుగు కార్యాలయం వద్ద మంగళవారం సామాజిక తనిఖీ ప్రజా వేదికలో నిర్వహించారు. రూ.6,17,90,411 విలువైన 878 పనులకు గ్రామస్థాయిలో సోషల్ ఆడిట్‌పై బహిరంగ సమావేశం నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ వివిధ గ్రామాల్లో ఆరోపించిన పనుల్లో భాగంగా రూ.29,121 రికవరీకి ఆదేశించామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి, ఏపీడీ బాలాజీ నాయక్, విజిలెన్స్ అధికారి షీబారాణి, ఎంపీడీఓ మహమ్మద్ దౌలా, ఏపీఓ మనోహర్ పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగినికి టోకరా

డోన్ టౌన్: స్థానిక శ్రీరామ్‌నగర్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని శిరీషకు సైబర్ నేరగాళ్లు టోకరా పెట్టారు. విదేశాల నుంచి వచ్చిన పార్శిల్‌లో నిషేధిత వస్తువులు, మత్తు పదార్థాలు ఉన్నాయని, మీరు ఆర్డర్ చేయకపోతే ఆన్‌లైన్ కంప్లైంట్ ఇవ్వాలని మాటల్లో దింపి చాకచక్యంగా ఆమె అకౌంట్‌లో నుంచి రూ.3.60 లక్షలు కాజేశారు. బాధితురాలు తెలిపిన వివరాలు..మంగళవారం ఉదయం శిరీష సెల్ ఫోన్‌కు అపరిచిత వ్యక్తి ఫోన్ చేసి తాము ముంబయి నుంచి పోలీసులం మాట్లాడుతున్నామని, మీకు విదేశాల నుంచి ఫెడెక్స్ కొరియర్ నుంచి పార్శిల్ వచ్చిందని, అందులో కొన్ని నిషేధిత వస్తువులు, మత్తు పదార్థాలతోపాటు నకిలీ పాస్‌పోర్ట్‌లు ఉన్నాయని భయపెట్టాడు. పార్శిల్ పంపిన నేరగాళ్ల ఫొటోలతోపాటు లెటర్లు ఇవేనని వాట్సాప్‌కు పంపారు. వారితో తమకు ఎలాంటి సంబంధం లేదని, ఎలాంటి వస్తువులు బుక్ చేయలేదని వివరణ ఇవ్వగా, అకౌంట్ నుంచి కూడా వేరే పది ఖాతాలకు మనీలాండరింగ్ జరిగిందని పూర్తి వివరాలు తెలియజేస్తే విచారిస్తామని చెప్పి ఆధార్‌కార్డు, బ్యాంక్ వివరాలు తెలుసుకున్నారు. ముంబయికి వచ్చి ఫిర్యాదు చేయాలని లేక పోతే నిందితులతో సంబంధాలు ఉన్నట్లు అనుమానించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఇందుకు బాధితురాలు ముంబయికి రాలేమని చెప్పగా.. ఒక లింక్ పంపి అది ఓపెన్ చేసి పూర్తి వివరాలు నింపి ఆన్‌లైన్ కంప్లైంట్ ఇవ్వాలని సూచించారు. ఇందుకు ఆమె వివరాలు నమోదు చేయడంతో ఐసీఐసీఐ బ్యాంక్ ఖాతాను హ్యాక్ చేసి అందులో ఉన్న రూ.1.10 లక్షలు మళ్లించుకోవడంతోపాటు, రూ.2.50 లక్షల ప్రీ అప్రూవ్డ్‌లోన్ మంజూరు చేయించి వాటిని కూడా బదలాయించుకున్నారు. తన బ్యాంక్ ఖాతా నుంచి డబ్బు ట్రాన్స్‌ఫర్ అయిన విషయం తెలుసుకుని బ్యాంక్ అధికారులను సంప్రదించగా వారు 9130 కంప్లైంట్ చేయించారు.





కర్నూలు నగరంలోని బుధవారపేటకు చెందిన అనిల్‌కుమార్ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. ఎముకలు విరిగి చికిత్స కోసం రాత్రివేళ కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు వెళితే కర్నూలే కదా ఉదయం రమ్మన్నారు. నొప్పిగా ఉందని చికిత్స చేయాలని చెప్పినా ఎవరూ పట్టించుకోలేదు. అక్కడే ఉన్న ఓ ఉద్యోగి తనకు తెలిసిన ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ఆపరేషన్ బాగా చేస్తారని చెప్పి మరునాడు ఉదయం వారు అక్కడికి వెళ్లేలా చేశాడు. ఆ తర్వాత తన కమీషన్ అందుకున్నాడు.

కోడుమూరుకు చెందిన వీరేష్‌కు వారం క్రితం ఛాతిలో నొప్పి వచ్చింది. వెంటనే కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తీసుకొచ్చారు. వైద్యులు అతనికి ఈసీజీ తీయించారు. గుండెపోటు వచ్చిందని భావించి మెరుగైన వైద్యం చేసేందుకు చర్యలు ప్రారంభించారు. ఇదే సమయంలో క్యాజువాలిటీ బయట ఉన్న కొందరు వ్యక్తులు ఇక్కడైతే చికిత్స ఆలస్యమై ప్రాణాలకే ప్రమాదముందని, వెంటనే ఫలానా ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళితే ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా చికిత్స చేస్తారని చెప్పి పంపించేశాడు.

వీరిద్దరే కాదు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల నుంచి ప్రతిరోజూ 8 నుంచి 10 మందిని కొందరు వ్యక్తులు ప్రైవేటు ఆసుపత్రులకు తరలిస్తున్నారు. ఈ కారణంగా ఆసుపత్రికి రావాల్సిన ఖజానా పక్కదారి పడుతోంది. ప్రైవేటు ఆసుపత్రుల్లో సాధ్యం కాని, ప్యాకేజీ సరిపోని కేసులు మాత్రమే ఇక్కడ చికిత్స చేస్తున్నారు. చాలా మంది వైద్యులకు ఈ విషయం తెలిసినా ఏమీ చేయలేని పరిస్థితి. ఆసుపత్రిలోని కొందరు వైద్య సిబ్బందే దళారులుగా మారి రోగులను ప్రైవేటుకు తరలిస్తుండటంతో ఏమీ చేయలేని పరిస్థితి.



మాటు వేసి.. గేటు దాటించి

ఆరోగ్యశ్రీ కేసులు పక్కదారి

- పెద్దాసుపత్రి నుంచి ప్రైవేటుకు తరలింపు
- దళారుల అవతారం ఎత్తిన ఆసుపత్రి సిబ్బంది
- క్యాజువాలిటీ నుంచే ఎక్కువగా తరలింపు
- పట్టించుకోని అధికారులు



కర్నూలు పెద్దాసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు (ఫైల్)

కర్నూలు(హాస్పిటల్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులు 229 ఉండగా ఒక్క కర్నూలు నగరంలో 42 హాస్పిటళ్లు ఉన్నాయి. అయితే కొన్ని ప్రైవేటు ఆసుపత్రులు ఇచ్చే కమీషన్లకు ఆశపడి కొందరు వైద్య సిబ్బంది దళారుల అవతారమెత్తారు. వీరితో పాటు ఆసుపత్రి బయట ప్రైవేటు ఆసుపత్రులకు చెందిన వ్యక్తులు కూడా గద్దల్లా ఆసుపత్రి క్యాజువాలిటీ ముందర కాపు కాసి ఆసుపత్రికి వచ్చిన రోగులను ఆరోగ్యశ్రీ ఇక్కడ వర్తించినా ప్రైవేటుకు తరలించి కమీషన్లు దండుకుంటున్నారు. ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పనిచేస్తూ ప్రజల పన్నులతో జీతం తీసుకుంటూ ఈ ఆసుపత్రినే మోసం చేసే మోసగాళ్లు ఇక్కడ పనిచేస్తున్నారు. ఆసుపత్రిలో చికిత్స కోసం వచ్చిన రోగులను డబ్బులకు ఆశపడి ప్రైవేటు ఆసుపత్రులకు తరలించి తమ జేబులు నింపుకుంటున్నారు. ఆసుపత్రికి ప్రతిరోజూ 2,500 నుంచి 3వేల మంది దాకా ఓపీ, నిత్యం 1200ల నుంచి 1500ల మంది దాకా ఇన్‌పేషెంట్లు చికిత్స పొందుతున్నారు. ఈ ఆసుపత్రికి కర్నూలు జిల్లాతో పాటు నంద్యాల, వైఎస్సార్, అనంతపురం, శ్రీ సత్యసాయి, ప్రకాశం జిల్లా, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి రోగులు చికిత్స కోసం వస్తుంటారు. ఎన్నో ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రైవేటు ఆసుపత్రులు తిరిగి వేసారి, చివరకు పెద్దాసుపత్రికి వస్తున్న వారు కొందరైతే, చేతిలో డబ్బులేకపోవడం, ప్రైవేటులో వైద్యం చేయించుకునే స్తోమత లేకపోవడం వల్ల వస్తున్న వారు మరికొందరు. ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చివరి నిమిషంలో ప్రభుత్వ ఆసుపత్రికి వస్తున్నవారు ఇంకొందరు. అయితే అత్యవసరం వైద్యం కోసం వచ్చేవారిని ఎగరేసుకుపోయే ప్రైవేటు ఆసుపత్రుల దళారులు ఆసుపత్రి చుట్టూ మాటువేశారు. రోగులు కనిపిస్తే చాలు వారిని బుట్టలో వేసుకుని తరలించుకుపోతున్నారు. ఆయా ఆసుపత్రుల్లో ఎలాంటి వసతి, సౌకర్యాలు, నిపుణులైన వైద్యులు లేకపోయినా అన్నీ ఉన్నాయని భ్రమ కల్పించి రోగులను తరలించుకుపోయే ముఠాలు తయారయ్యాయి.

కారణాలు ఇవీ..

ప్రభుత్వ ఆసుపత్రి నుంచి ప్రైవేటు ఆసుపత్రులకు రోగులు తరలిపోయేందుకు ప్రధానంగా సేవలు ఆలస్యమే కారణంగా కనిపిస్తోంది. ఇక్కడ ఆలస్యమయ్యే కొద్దీ రోగి ప్రాణాలకే ముప్పు అని భావించి చాలా మంది రోగుల కుటుంబీకులు దళారుల మాటలు నమ్మి ప్రైవేటుకు వెళ్తున్నారు. ఉదాహరణకు గుండెపోటు వచ్చిన వ్యక్తికి ప్రైవేటులో అయితే ఉన్నచోటే ఈసీజీ, 2డీ ఎకో, బెడ్‌పైనే ఎక్స్‌రే తీస్తారు. అక్కడే ఉన్న డ్యూటీ డాక్టర్ వెంటనే నిర్ణయం తీసుకుని అవసరమైన మందులు, ఇంజెక్షన్లు ఇవ్వడమే గాక కేథలాబ్‌కు తీసుకెళ్లి అవసరమైన స్టెంట్, ఇంకా అవసరమైతే ఆపరేషన్ కూడా నిర్వహిస్తున్నారు. ఇది కొన్నిసార్లు గంటల వ్యవధిలో కూడా జరిగిపోతోంది. అలాగే ఎముకలు విరిగి చికిత్స కోసం వచ్చిన రోగులకు వెంటనే బెడ్‌పైనే ఎక్స్‌రే తీసి చూసి నగదు అయితే వెంటనే, ఆరోగ్యశ్రీలో అయితే ఆరోగ్యశ్రీ అనుమతులు వచ్చాక ఆపరేషన్ చేస్తున్నారు. అక్కడ వసతులు, సౌకర్యాలు సైతం ప్రభుత్వ ఆసుపత్రి కంటే మెరుగ్గా ఉంటున్నాయని, ఎక్కడైనా ఉచితం కదా అని ప్రైవేటుకు వెళ్లేందుకే రోగులు, వారి సహాయకులు ఆలోచిస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అయితే చికిత్స ఆలస్యం అవుతుందన్న నమ్మకం బలంగా ఉంటోంది. ప్రైవేటులో కూడా చికిత్స చేయకపోతేనే ప్రభుత్వ ఆసుపత్రిలో ఉంటున్నారు.

ఉచితమని నమ్మించి.. అదనపు వసూళ్లు

ప్రభుత్వ ఆసుపత్రి నుంచి ప్రైవేటు ఆసుపత్రికి తరలించాక ఆరోగ్యశ్రీ ద్వారా మెరుగైన వైద్యం అందిస్తామని ముందుగా నమ్మబలుకుతున్నారు. అనంతరం చికిత్స ప్రారంభమయ్యాక ఆరోగ్యశ్రీలో ఇచ్చే ప్యాకేజీలో ఫలానా మందులు, పరికరాలతో వైద్యం చేయాల్సి వస్తుందని, ఇంకా నాణ్యమైన వైద్యం కావాలంటే అదనంగా సొమ్ము చెల్లించాల్సి ఉంటుందని ఆశ పెడుతున్నారు. ప్రాణంపై ఆశతో వైద్య సిబ్బంది చెప్పే మాట లు నమ్మి వారు అడిగిన మొత్తాన్ని చెల్లిస్తున్నారు. రోగులను ప్రైవేటు ఆసుపత్రులకు తరలించినందుకు గాను దళారులుగా వ్యవహరించిన వారికి రూ.3వేల నుంచి రూ.5వేల వరకు కమీషన్లు ముట్టజెబుతున్నారు.

ప్రైవేటు ఆసుపత్రులకు దర్జాగా తరలింపు

పెద్దాసుపత్రి క్యాజువాలిటీకి వచ్చిన ప్రమాద కేసులు, అత్యవసర వైద్యం కోసం వచ్చే కేసులు కొన్ని నిమిషాల్లోనే ప్రైవేటుకు తరలిపోతున్నాయి. ఎక్కువగా గాయత్రి ఎస్టేట్, బుధవారపేట, కొత్తబస్టాండ్ సమీపంలోని కొన్ని ప్రైవేటు ఆసుపత్రుల నిర్వాహకులు రోగులను తరలించేందుకు దళారులను ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఓ ప్రైవేటు ఆసుపత్రి ఏకంగా ఆసుపత్రి పరిసరాల్లోనే కారును సిద్ధంగా ఉంచుతోంది. ఆసుపత్రి నుంచి బయటకు పంపించేందుకు కొందరు కిందిస్థాయి ఉద్యోగులతో పాటు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు కూడా ఉంటున్నారు. ప్రధానంగా గుండెపోటు, ఇతర గుండె సమస్యలతో వచ్చే రోగుల వివరాలను తెలుసుకుని వెంటనే ప్రైవేటు ఆసుపత్రులకు ఫోన్ చేసి తరలించుకుపోతున్నారు.

దృష్టి సారించని అధికారులు

ప్రభుత్వ ఆసుపత్రి నుంచి రోగులు ప్రైవేటుకు వెళ్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. క్యాజువాలిటీకి వచ్చిన కొద్ది నిమిషాలకే కేసులు వెళ్లిపోతున్నా పట్టించుకోవడం లేదు. ఆసుపత్రిలో దళారులు యథేచ్ఛగా తిరుగుతున్నా అధికారులతో పాటు సెక్యూరిటీలు గుర్తించలేకపోతున్నారు. ఆసుపత్రిలో ప్రైవేటు వాహనాలు తిష్టవేసినా పట్టించుకునే వారు కరువయ్యారు. రోగులు వారి ఇష్టం మేరకు ఏ ఆసుపత్రికైనా వెళ్లిపోయి చికిత్స తీసుకునే హక్కు ఉండటంతో కొన్నిసార్లు విషయం తెలిసినా ఏమీ చేయలేకపోతున్నామని ఓ అధికారి ఆవేదన వ్యక్తం చేశారు.

చర్యలు తీసుకుంటాం



ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులను ప్రైవేటు ఆసుపత్రికి తరలిస్తున్నారన్న విషయం మా దృష్టికి వచ్చింది. ఇందులో మా ఆసుపత్రి సిబ్బంది కొందరు ఉన్నట్లు తెలిసింది. త్వరలో అన్ని విభాగాలతో సమావేశం ఏర్పాటు చేసి అవసరమైన చర్యలు తీసుకునేందుకు చర్చిస్తాం. రోగులు ప్రైవేటుకు వెళ్లకుండా కట్టడి చేస్తాం. ఈ మేరకు దళారులు, ప్రైవేటు వ్యక్తుల పట్ల నిఘా ఉంచి కఠిన చర్యలు తీసుకుంటాము.

– డాక్టర్ కె. వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్, పెద్దాసుపత్రి

వసతి గృహాలను పరిశుభ్రంగా ఉంచండి

- జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి గణియా

నంద్యాల: ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతోపాటు పిల్లలకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి వసతి గృహాల సంక్షేమ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని పీజీఆర్ఎస్ హాల్‌లో సోషల్, బీసీ, ట్రైబల్, మైనారిటీ వెల్ఫేర్, ఎస్సీ, బీసీ రెసిడెన్షియల్, మైనారిటీ రెసిడెన్షియల్, గురుకులాల అధికారులు, వసతి గృహాల సంక్షేమ అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను ఎంతో నమ్మకంతో సంక్షేమ వసతి గృహాల్లో ఉంచి చదివించుకుంటున్నారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పరిశుభ్రత వాతావరణం కల్పించి, మంచి అలవాట్లపై అవగాహన కల్పించడం, విద్యాబుద్ధులు నేర్పించడంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. మెనూ ప్రకారం నాణ్యతతో కూడిన ఆహార పదార్థాలను అందివ్వడంతోపాటు మరుగుదొడ్లు, టాయిలెట్లను శుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలల సమయం తర్వాత వసతి గృహాల్లో స్టడీ అవర్స్ ఏర్పాటు చేసి ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు కృషి చేయాలని ఆదేశించారు. ప్రహరీలు, ఆర్వో ప్లాంట్లు, సివిల్ వర్క్‌లు, పాత బిల్డింగ్‌లు, స్టాఫ్ క్వార్టర్స్ లేవనే సమస్యలు చెబుతున్నారని, ఇందుకు సంబంధించి నాలుగు నెలల నుంచి ఒక్క ప్రతిపాదన కూడా అందలేదన్నారు. మూడు రోజుల్లో ప్రతిపాదనలు తయారు చేసిన తనకు పంపాలన్నారు. సమావేశంలో జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి చింతామణి, బీసీ వెల్ఫేర్ అధికారి ముస్తక్ అహమ్మద్, ఐటీడీఏ పీఓ వెంకట శివప్రసాద్, బీసీ రెసిడెన్షియల్ వెల్ఫేర్ కన్వీనర్ ఫ్లోరా, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జిల్లా కోఆర్డినేటర్ శ్రీదేవి పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణాలు పూర్తి చేయండి

పల్లె పండగ, పంచాయతీ వారోత్సవాల్లో శంకుస్థాపన చేసిన 1,026 సీసీ రోడ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ జి.రాజకుమారి పంచాయతీరాజ్ ఇంజినీర్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లను ఆదేశించారు. సీసీ రోడ్ల నిర్మాణ పనులపై నిర్వహించిన అవగాహన సదస్సులో కలెక్టర్ మాట్లాడుతూ రోడ్ల నిర్మాణాలకు దాదాపు రూ.86 కోట్లతో శంకుస్థాపన చేశామని నాణ్యతలో రాజీ పడకుండా పనులు చేపట్టాలన్నారు. పూర్తయిన పనులను ఈనెల 23న స్థానిక ప్రజాప్రతినిధుల చేత ప్రారంభోత్సవాలు నిర్వహించుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఎస్ఈ నాగరాజు, ఈఈ రఘురామిరెడ్డి, డీఈ పాల్గొన్నారు.

డయాలసిస్ ప్రయాణానికి 108 బ్రేక్

కర్నూలు(హాస్పిటల్): కిడ్నీ సమస్యలతో బాధపడుతూ ఆసుపత్రిలో డయాలసిస్ చేయించుకునే రోగులకు 108 షాక్ ఇచ్చింది. కూటమి ప్రభుత్వం నుంచి 108కు సహాయ సహకారాలు సక్రమంగా లేకపోవడంతో గత నాలుగు రోజుల నుంచి వారిని ఆసుపత్రులకు తీసుకెళ్లేందుకు నిరాకరిస్తోంది. ఈ మేరకు తమకు పైనుంచి ఉత్తర్వులు వచ్చాయని పేర్కొంటోంది. దీంతో డయాలసిస్ రోగులు ప్రయాణానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లాలో గత నాలుగేళ్లుగా ప్రతి నెలా 600 మందికి పైగా డయాలసిస్ రోగులను ఆయా ఆసుపత్రులకు 108 అంబులెన్స్‌లో తీసుకెళ్లేవారు. ఈ మేరకు వ్యయప్రయాసలు తగ్గేవి. కోవిడ్-19 సమయంలో ఈ సేవలు ప్రారంభమయ్యాయి. అప్పట్లో డయాలసిస్ రోగులు ఆసుపత్రులకు వెళ్లేందుకు అవసరమైన ప్రయాణ సదుపాయాలు లేకపోవడంతో 108 అంబులెన్స్‌లు ఉపయోగించడం ప్రారంభించారు. అంతకు ముందు వారు ప్రైవేటు వాహనాల్లో ఆసుపత్రులకు వెళ్లాల్సి వచ్చేది. ఇందుకోసం రూ.2 వేల వరకు వారు ఖర్చు చేయాల్సి వచ్చింది. ఇప్పుడు 108 అంబులెన్స్‌లో తీసుకెళ్లడం ఆగిపోవడంతో మళ్లీ పూర్వం లాగే ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది. డయాలసిస్ చేయించుకునే సమయానికి ఆర్టీసీ బస్సులు రావడం లేదు. కొన్నిసార్లు ఆలస్యమై డయాలసిస్ చేయించుకోలేని పరిస్థితి. డయాలసిస్ చేయించుకుని వచ్చినా కొన్నిసార్లు బస్సులు లేని పైనం ఉండేది. ఇప్పుడు మళ్లీ అలాంటి బాధలు తమకు తప్పవని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైతులకు తుపాన్ బెంగ..!



కోవెలకుంట్ల మండలం జోళదరాశి సమీపంలో కోత దశలో ఉన్న వరి



మహానంది మండలం గాజులపల్లె వద్ద వరి ధాన్యం తడవకుండా పట్ట కప్పుతున్న రైతులు

- పలు ప్రాంతాల్లో వర్షపు జల్లులు
- వరి, కంది, పత్తి పంటలకు నష్టం

కోవెలకుంట్ల: బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కారణంగా అల్పపీడనం ఏర్పడి బుధవారం నుంచి మూడు రోజులపాటు భారీ వర్షాలు కురిసే ఆస్కారం ఉందని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసింది. మంగళవారం ఉదయమే వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు చోటుచేసుకుని మేఘావృతమై జిల్లాలోని పలు ప్రాంతాల్లో వర్షపు జల్లులు పడటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన వివిధ పంటలు కోత, నూర్పిడి, పూత, పిందె దశల్లో ఉండగా తుపాన్ రైతులను భయపెడుతోంది. జిల్లాలోని ఆయా మండలాల పరిధిలో 66,314 హెక్టార్లలో కర్నూలు, నంద్యాల సోనా రకాల వరి, 42,922 హెక్టార్లలో కంది, 54,354 హెక్టార్లలో మొక్కజొన్న, 7,111 హెక్టార్లలో పత్తి పంటలు సాగయ్యాయి. వరి పంటలో రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు, కలుపు తదితర పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ. 25 వేల వరకు వెచ్చించారు. ప్రస్తుతం పైరు కోత, నూర్పిడి దశలో ఉంది. చిన్నపాటి వర్షం కురిసినా వరి నేలవాలి వడ్లు రాలిపోయి రంగుమారే ఆస్కారం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మొక్కజొన్న పంట నూర్పిడి పనులు జరుగుతున్నాయి. దిగుబడులను కల్లాలు, పొలాలు, రోడ్లపై ఆరబోసుకున్నారు. దిగుబడులు వర్షానికి తడవకుండా పట్టలు కప్పుకున్నారు. ఈ ఏడాది విస్తారంగా సాగైన కంది పంట ప్రస్తుతం పూత దశలో ఉంది. ఆయా పంటల్లో పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ.20 వేలకు పైగా వెచ్చించారు. సీడు, హైబ్రిడ్ పత్తి పూత, కాయ దశల్లో ఉండగా రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు, కూలీల రూపంలో ఎకరాకు రూ.50 వేల నుంచి రూ.75 వేల వరకు ఖర్చు చేశారు. ఇలాంటి తరుణంలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేయడంతో రైతులు భయాందోళన చెందుతున్నారు.

లక్ష్యం నీరుగార్చి.. నిధులు కొల్లగొట్టి!

- గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల పేరుతో దోచేసిన తమ్ముళ్లు
- విజిలెన్స్ విచారణ చేయించిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- తనిఖీల్లో భారీగా అవినీతి జరిగినట్లు వెల్లడి
- డోన్ కేంద్రంగా ఇంజినీర్ల సంతకాలు ఫోర్జరీ, తప్పుడు డాక్యుమెంట్ల తయారీ
- ఇంజినీర్ల ఫిర్యాదుతో జల వనరుల శాఖ ఉన్నతాధికారులకు లేఖ రాసిన ఎస్ఈ
- విచారణ అధికారిగా ఎస్ఈకి బాధ్యతలు



ఇక్కడ చెక్‌డ్యాం కట్టినట్లు రూ.7.72 లక్షల బిల్లు పెట్టిన హాలహర్వి మండలం సింగాపురం గ్రామ సమీపంలోని ఈర్ల వంక ఇదే

కర్నూలు సిటీ: భూగర్భ జలాల పరిరక్షణ కోసమంటూ 2015లో అప్పటి సీఎం చంద్రబాబు నాయుడు తెచ్చిన నీరు-చెట్టు పథకం తెలుగు తమ్ముళ్లకు ఆదాయ వనరుగా మారింది. 2019 ఎన్నికల ముందు వరకు పనులకు అడ్డగోలుగా అనుమతులిచ్చి కొందరు అధికారులతో కలిసి.. టీడీపీ నాయకులు అందినకాడికి దోచుకున్నారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నీరు-చెట్టు పథకంపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌తో విచారణ చేయించింది. విజిలెన్స్ అధికారులు ర్యాండంగా చేసిన పనులను తనిఖీలు చేయగా భారీగా అవినీతి జరిగినట్లు నిర్ధారణ అయ్యింది. తనిఖీ చేసిన పనుల్లో రూ.14.72 కోట్ల రికవరీతోపాటు, జల వన రుల శాఖకు చెందిన 8 మంది ఇంజినీర్లపై చార్జెస్ నమోదు చేశారు. నీరు-చెట్టు పథకం కింద చేసిన పనులకు బిల్లులు చెల్లించాలని హైకోర్టులో తెలుగుదేశం పార్టీ కేసులు వేయించింది. ఇదే అదునుగా భావించిన ఆ పార్టీ కార్యకర్తలు చేసిన పనులతోపాటు చేయని పనులకు సైతం బిల్లులు పెట్టారు. కోర్టు ఆదేశాలతో కంటెమ్ట్ ఆఫ్ కోర్టు అయిన వాటికి బిల్లులు చెల్లింపులో ప్రాధాన్యత ఇచ్చారు. ఈ సమయంలో చేయని పనులకు బిల్లులు చేయాలని కోర్టుకు వెళ్లి డబ్ల్యూ.పీ నెంబర్లు తెచ్చుకున్నారు. దీనికి కౌంటర్ వేసే సమయంలో అసలు ఆ పనులే చేయలేదని బట్టబయలైంది. తాము క్లోజ్ చేసిప పనులకు బిల్లులు చేయలేదని తమ సంతకాలు ఫోర్జరీ చేశారని, నాణ్యతకు సంబంధించిన సరిఫికెట్లు సైతం తప్పుడు పత్రాలు సృష్టించారని, వాటితో తమకు ఎలాంటి సంబంధం లేని వాటిపై విచారణ చేయించాలని చిన్న నీటిపారుదల శాఖ ఆదోని సబ్ డివిజన్‌లోని ఇంజినీర్లు జల వనరుల శాఖ కర్నూలు సర్కిల్ ఎస్ఈకి ఫిర్యాదు చేశారు. ఇదే విషయమై ఉన్నతాధికారులకు ఎస్ఈ బాలచంద్రారెడ్డి లేఖ రాశారు. కాగా విచారణ అధికారిగా చార్జెస్ నమోదైన ఎనిమిది మందిలో ఒకరైన ఎస్ఈనే నియమించడం ఈ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏమిటో తెలిసిపోతుంది.

కమిటీల పేరుతో రూ.కోట్లు కొట్టేశారు..

జల సంరక్షణ కోసం చేపట్టిన నీరు-చెట్టు పథకం కింద ఉమ్మడి జిల్లాలో 13,806 పనులు, 1,366.43 కోట్ల విలువైన వాటికి అనుమతులు ఇచ్చారు. ఇందులో రూ.1,265.69 కోట్ల పనులు చేపట్టగా.. సుమారు రూ.580 కోట్ల పనులు పూర్తయ్యాయి. చెరువులు, కుంటలు, చెక్‌డ్యామ్‌ల్లో, వాగుల్లో పేరుకుపోయిన పూడిక తీసి, ఆ పూడిక మట్టిని రైతుల పొలాలకు ఉచితంగా తరలించి సారవంతం చేయాలనేది లక్ష్యం. జన్మభూమి కమిటీల ఆమోదంతో పనులు చేయాల్సి ఉన్నా..ఆ కమిటీ ముసుగులో మాఫియాగా మారిన తమ్ముళ్లు ప్రజా ధనాన్ని లూటీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా చేయలేమని కొందరు ఇంజినీర్లు అభ్యంతరం చెప్పినా.. అప్పటి జిల్లా కలెక్టర్ ద్వారా ఒత్తిళ్లు తెచ్చి మరీ పనులు చేయించుకున్నారు. 2019లో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో ర్యాండమ్‌గా జిల్లాలో రూ.23.22 కోట్ల విలువైన 233 పనులను చేయగా, 161 పనుల్లో చేసిన పనికి, రికార్డు చేసిన పనుల విలువకు తేడాలు ఉన్నట్లు, 72 పనుల్లో భారీగా అవినీతి జరిగినట్లు బయటపెట్టారు. మరో రూ.11 కోట్లు స్వాహా చేసినట్లు నిర్ధారించి మొత్తం రూ.14.71 కోట్లు రికవరీ చేయాలని ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు.

చిన్న నీటిపారుదల శాఖ కర్నూలు డివిజన్ ఆఫీస్ కేంద్రంగానే కుట్ర..!

నీరు-చెట్టు పథకం కింద పూర్తి చేసిన పనులతో పాటు, అగ్రిమెంట్ చేసుకోని, చేపట్టని పనులను ఎంపిక చేసుకొని ఆ పనికి సంబంధించిన ఇంజినీర్ల సంతకాలను డోన్ ప్రాంతంలో ఫోర్జరీ సంతకా లు చేసే ముఠా ద్వారా చేయించి బిల్లులు పెట్టినట్లు విమర్శలున్నాయి. కరోనా సమయంలో చిన్న నీటిపారుదల శాఖ కర్నూలు డివిజన్ కార్యాలయంలోనే దొంగబిల్లుల ఆలోచనకు కుట్ర జరిగిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆ బిల్లులకు సంబంధించిన ఎం.బుక్‌లను ఓ ప్రైవేట్ ప్రింటింగ్ వద్ద ముద్ర వేయించుకుని ఓ ఈఈ, టీడీపీకి చెందిన ఇద్దరు కాంట్రాక్టర్లతో కలిసి కోట్లాది రూపాయల స్వాహా కు పన్నాగం పన్నినట్లు తెలుస్తోంది. 2019లోనే ఓర్వకల్లు మండలంలోని ఓ వర్క్‌ను ఆ టీడీపీ కాంట్రాక్టర్ల పేరుతో తప్పుడు పత్రాలు పుట్టించి, డోన్ సబ్ డివిజన్ ఇంజినీర్లతో సంతకాలు చేయించిన ట్లు అప్పటి ఎస్ఈ దృష్టికి వెళ్లగా వెంటనే చేసిన వాటిని రద్దు చేశారు. ఆ తర్వాత ఆదోని డివిజన్ పరిధిలోని ఆలూరు,ఆస్పరి, హాలహర్వి, ఆదోని మండలాల్లోని పనులకు నకిలీ డాక్యుమెంట్లు సృష్టించినట్లు బిల్లుల కోసం కోర్టును ఆశ్రయించి డబ్ల్యూ.పీ నెంబర్లు పొంది, కౌంటర్ వేసే సమయంలో కుట్ర బయట పడింది. ఇందులో ఇద్దరు ఈఈలు, ఓ డీఈఈ, ఒక ఏఈఈ ఉన్నట్లు తెలుస్తోంది.